

కళాశాలల్లో నిర్బంధ వైద్య పరీక్షలు

రాష్ట్రంలో అతి చిన్న వయస్సువారు గుండెపోటుతో మరణిస్తున్న తరుణంలో ప్రతీ కళాశాలలో నిర్బంధ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి కమలాకర్ తెలిపారు. - 8లో▸



పుస్తకాలతోనే నిజమైన చరిత్ర

ప్రపంచంలో పుస్తకానికి ఉండే విలువ దేనికీ ఉండదని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. పుస్తక మహోత్సవం కార్యక్రమంలో ఎంపీ విశిష్ట అతిథిగా పాల్గొని స్టాళ్లను సందర్శించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాములోరి హుండీ ఆదాయం రూ.4,47,577



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ఇల్లందకుంట(హుజూరాబాద్): అపరభద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో 13 హుండీలను శనివారం దేవాదాయ, ధర్మాదాయశాఖ కరీంనగర్ డివిజన్ పరిశీలకుడు పి.సత్యనారాయణ సమక్షంలో, ఆలయ కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో పెద్దపాపయ్యపల్లె శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి, అంబాల, భీంపల్లికి చెందిన భక్తులు లెక్కించారు. ఆగస్టు నుంచి భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించగా రూ.4,47,577 ఆదాయం వచ్చిందని తెలిపారు. అర్చకులు శేషం రామాచార్యులు.శేషం వంశీధరచార్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): శాతవాహన యూనివర్సిటీలో పనిచేస్తున్న ఎంప్లాయిస్, కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ వర్కర్స్ యూనియస్ అధ్యక్ష, కార్యదర్శులు ముక్కల శ్రీనివాస్, ఇళ్లందుల సతీష్ మాట్లాడుతూ, యూనివర్సిటీలో 150 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారని, వారికి ఇప్పటివరకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. పదేళ్ల సర్వీసు పూర్తి అయిన ప్రతి కార్మికుడిని పర్మినెంట్ చేయాలని, యూనివర్సిటీలో గ్రూపు వర్కర్లుగా ఉన్న కార్మికులను ఔట్‌సోరిస్ంగ్ విధానంలోకి మార్చాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, యూనివర్సిటీ పరిధిలో కొత్త రిక్రూట్‌మెంట్ విధానంలోకి అర్హత ఉన్నా కార్మికుడికి ప్రమోషన్ కల్పించి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కార్మికులు రాజేందర్, రాజు, రజిత, మమత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రియాంక

సంకీర్తనల పూదోట ప్రియాంక

జెడ్పీ సీఈవో సీహెచ్.ప్రియాంక విధినిర్వహణలో బిజీగా ఉంటున్నా.. ఏ మాత్రం విరామం దొరికితే చాలు.. తన స్వరానికి పనిచెబుతుంటారు. కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ సతీమణి అయిన ఈమె ఇటీవలే ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉన్నాయంటే చాలు ఈమె భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంటుంది. చిన్నతనం నుంచే సంగీతం నేర్చుకున్న ప్రియాంక.. బ్రహ్మోత్సవాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాటలు పాడుతూ అలరిస్తుంటారు. ఇటీవల కరీంనగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో 'ముద్దుగారే యశోద' అంటూ ఆలపించిన సంకీర్తనతో ఆహుతులను ఆకట్టుకున్నారు.

కరీంనగర్ అర్బన్: వృత్తి, ప్రవృత్తుల సంగమమంటే ఈ ప్రభుత్వ అధికారులు గుర్తొస్తారు. ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వీరిలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి. విధి నిర్వహణలో ప్రజలకు సేవలందిస్తూనే.. తమ అభిరుచులకు తగ్గట్టు జీవిస్తున్నారు. ఒత్తిడిని మరిచి ఉల్లాసంగా గడుపుతున్నారు. తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకరు సాహసాలకు చిరునామాగా నిలిస్తే.. మరికొందరు పాటల పూదోటలో కోయిలలుగా రాణిస్తున్నారు. ఇంకొకరు వ్యాఖ్యానం చేస్తూ మాటల మాంత్రికుడిగా ముఖ్యులతో అభినందనలు పొందుతున్నారు. మరో అధికారి ఫ్లూట్‌ను వినసొంపుగా వినిపిస్తూ.. ఆకట్టుకుంటుండగా మరొకరు నటనతో రంజింపజేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు ద్విపాత్రాభినయ అధికారులపై సండే స్పెషల్..

సండే స్పెషల్

వృత్తిలో ఆదర్శం.. ప్రవృత్తిలో నైపుణ్యం

- ఆదర్శంగా నిలుస్తున్న అధికారులు
- ఓవైపు విధులు.. మరోవైపు అభిరుచుల ప్రస్థానం
- ఒక్కొక్కరిది ఒక్కో ప్రత్యేకత

గళం విప్పితే కరతాళ ధ్వనులే..



పాట పాడుతున్న బాలశ్రీనివాసాచారి

తన గళంతో మంత్రముగ్ధులను చేయడం బాలశ్రీనివాస్‌కే సొంతం. రాజన్న సిరిసిల్ల సీపీవో పెందోట బాలశ్రీనివాసాచారి బాల్యం నుంచే సరిగమలను ఔపోసన పట్టగా వేదిక దొరికిందంటే చాలు పాటలతో మైమరిపింపజేస్తారు. ఈయనది మానకొండూరు మండలం వేగురుపల్లి స్వగ్రామం. కరీంనగర్‌లో స్థిరపడ్డారు. తన తాత కట్ట లక్ష్మినర్సయ్య ఆల్‌ఇండియా రేడియో ఆర్టిస్ట్. ఆయన వద్ద సంగీతం నేర్చుకుని చదువుకునే వయసు నుంచి పాటలు పాడి బహుమతులు అందుకున్నారు. జానపదం, సినీగీతాలు, పౌరాణిక గాథలను వినసొంపుగా వినిపిస్తుంటారు.

పాతమధురాల గీతం.. మంజుల



కట్ట మంజులాదేవి, సూపరింటెండెంట్

కరీంనగర్ బాల భవన్ సూపరింటెండెంట్ కట్ట మంజులాదేవి ప్రభుత్వ అధికారిగా కన్నా గాయకురాలిగానే గుర్తింపు పొందారు. ఉమ్మడి జిల్లాలోని అధికారుల్లో మంజులాదేవిది ప్రత్యేకస్థానం. ప్రతి గణతంత్ర, స్వాతంత్ర్య, రాష్ట్ర అవతరణ వేడుక సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగే తేనీటి విందులో ఈమె పాట ఉండాల్సిందే. ఎంత ఒత్తిడిలో ఉన్నా పాటతో మనసు తేలిక అవుతుందంటారు మంజుల. ఈమె రాజన్న సిరిసిల్ల సీపీవో శ్రీనివాసాచారి సతీమణి కావడం గమనార్హం.

మాటల మాంత్రికుడు గోపాల్



వ్యాఖ్యానం చేస్తున్న మాడిశెట్టి గోపాల్

ఉమ్మడి జిల్లాలో వ్యాఖ్యానమంటే మాడిశెట్టి గోపాల్ పేరే వినిపిస్తుంది. కరీంనగర్‌కు చెందిన గోపాల్‌ది ఎల్ఐసీలో హయ్యర్‌గ్రేడ్ అసిస్టెంట్ హోదా. అటు విధి నిర్వహణ.. ఇటు ప్రవృత్తిని కొనసాగిస్తూ గుర్తింపు పొందారు. గణతంత్ర, స్వాతంత్ర్య, రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో వినిపించే మాటలు ఇతనివే. అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్.రాజశేఖర రెడ్డి జిల్లా పర్యటనల సమయంలోనూ తన వ్యాఖ్యానం ద్వారా అభినందనలు పొందారు. మలేసియా, సింగపూర్‌లోనూ వ్యాఖ్యానం చేశారు. ఉత్తమ వ్యాఖ్యాతగా అనేక అవార్డులు పొందారు. దీనితోపాటు కవి, రచయిత, నటుడిగానూ రాణిస్తున్నారు.





జీవీ శ్యాంప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్

బంగీ జంప్ చేస్తున్న జీవీ.శ్యాం ప్రసాద్‌లాల్

సాహసాలకు కేరాఫ్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్ రచయితలు, కవులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తుంటారు. అదే సమయంలో సాహసాలకూ చిరునామాగా నిలుస్తున్నారు. యువకులతో పోటీ పడుతుంటారు. నిత్యం విధి నిర్వహణలో సమీక్షలు, తనిఖీలతో బీజీగా ఉంటున్నా.. వీలు చిక్కినప్పుడల్లా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలను సందర్శిస్తుంటారు. ఉత్తరప్రదేశ్‌లో ఓ సారి బంగిజంప్ కూడా చేసి ఔరా అనిపించారు. సాహస క్రీడలైన కనోయింగ్‌తోపాటు అడవుల్లో నిర్వహించే వివిధ అంశాల్లో పాల్గొంటున్నారు.

ఫ్లూట్ పట్టారంటే సంగీత ప్రవాహమే



ఫ్లూట్‌తో పాట పాడుతున్న శ్రీనివాసరావు

శంకరపట్నం తహసీల్దార్ గూడూరి శ్రీనివాసరావుది చొప్పదండి మండలం కాట్నపల్లి. చదువుకునే రోజుల్లో టీవీల్లో ఫ్లూట్ ఊదుతుండడాన్ని గమనించి ఆసక్తి పెంచుకున్నారు. ఎంసెట్‌కు దరఖాస్తు చేస్తానని ఇంట్లో చెప్పి హైదరాబాద్ వెళ్లి ఫ్లూట్ కొనుక్కున్నారు. వాయిద్యకారుడు కంచర నారాయణ వద్ద ఓనమాలు నేర్చుకుని అప్పటినుంచి ఫ్లూట్ వినిపిస్తున్నారు. ఏ మాత్రం విరామం దొరికినా ఫ్లూట్ పడుతుంటారు. సంగీతాన్ని పాటను మేళవించి ఫ్లూట్‌ను వాయించడం ఇతనికే సొంతం.

కాళీ పంచ్ కొడితే పతకమే



బాక్సింగ్‌లో కాళీచరణ్



కాళిచరణ్

జగిత్యాల కలెక్టరేట్ సూపరింటెండెంట్ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్‌ది నగరంలోని సిక్‌వాడీ. చిన్నతనంలోనే బాక్సింగ్‌పై అభిరుచి ఎక్కువ. తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నా.. ఇప్పటికీ పంచ్‌పైనే ధ్యాస. విశ్వవిద్యాలయం స్థాయిల్లో పలుమార్లు మెడల్స్ సాధించిన ఆయన శాఖాపరమైన క్రీడల్లోనూ పతకాలు అందుకుంటున్నారు. ప్రస్తుతం యువ బాక్సర్లను తయారు చేస్తున్నారు.

ఎత్తు వేస్తే చిత్తవ్వాల్సిందే



చెస్ ఆడుతున్న మనోహర్‌రావు

చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పీఏగా ఉన్న నాయబ్ తహసీల్దార్ కానిపర్తి మనోహర్‌రావుది కరీంనగర్‌లోని వావిలాలపల్లి. బాల్య దశలోనే చదరంగంపై మక్కువ పెరగడంతో డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేవారు. స్వతహాగా చదరంగంలో మెలకువలు నేర్చుకుంటూనే రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉద్యోగం చేస్తూనే శాఖాపరంగా నిర్వహించే క్రీడలో పాల్గొంటూ ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ఆలిండియా, స్టేట్ విభాగాల్లో ప్రథమ స్థానం పొందారు.





నమో.. నారసింహ..

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సంప్రదాయం ప్రకారం కలెక్టర్ యాస్మిన్ బాషా ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. సాయంత్రం శేషప్ప వేదికపై నృసింహుని కల్యాణం కన్నులపండువగా జరిపించారు. వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ మంత్రోచ్చారణలతో ప్రత్యేకపూజలు చేశారు. నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించి తరించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గుగ్గిళ్లపు రమేశ్



కరీంనగర్‌టౌన్: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కరీంనగర్‌కు చెందిన గుగ్గిళ్లపు రమేశ్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రమేశ్ మూడు సార్లు నగరపాలక సంస్థకు ప్రాతినిధ్యం వహించారు. కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా గెలిచి 2014లో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు. టీడీపీ, టీఆర్ఎస్‌లో చాలా కాలం పనిచేసిన రమేశ్ 2020 డిసెంబర్‌లో బీజేపీలో చేరి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. కాగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ప్రేమేందర్‌రెడ్డి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నూలు డిపోలు రాలేదు.. కార్మికులు ఓనర్లు కాలేదు

- బీడీ కార్మికుల ఆస్పత్రి ఎందుకు కట్టలేదు
- కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఏమైంది
- నేరెళ్ల బాధితులకు పరిహారమేది
- సిరిసిల్లలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



మానేరు వంతెనపై రేవంత్ పాదయాత్ర



మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్..

సిరిసిల్ల: సిరిసిల్ల నేతకార్మికులు సాంచాలపై కూలీ చేస్తున్నారని, బతుకమ్మ చీరలతో కొంత మంది పెద్ద సేట్లకు మాత్రమే లాభం జరుగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి సిరిసిల్లలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ నుంచి సిరిసిల్ల పట్టణం వరకు పాదయాత్రగా వచ్చారు. సిరిసిల్ల నేతన్న చౌక్‌లో నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'సిరిసిల్లలో సభ అంటే.. కేటీఆర్ భయపడి ఎవరూ రారు అనుకున్నా. కానీ వారి బెదిరింపులకు భయపడకుండా.. ఇంత భారీగా జనం రావడం సంతోషంగా ఉందని' అన్నారు. సిరిసిల్లకు నూలుడిపోలు రాలేదని.. నేత కార్మికులు ఓనర్లు కాలేదన్నారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉండగా.. మంజూరైన బీడీ కార్మికుల ఈఎస్ఐ ఆస్పత్రిని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీని పూర్తి చేయకుండా.. కమీషన్లను మంత్రి కేటీఆర్ దండుకున్నారని ఆరోపించారు. 9వ ప్యాకేజీ పూర్తి చేస్తే సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలు సస్యశ్యామలం అయ్యేవని.. కానీ కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్‌లు పూర్తి చేసి నీటిని తరలించుకుపోయారన్నారు. నేరెళ్ల దళితులను ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు. ఇసుక లారీలకు అడ్డు వస్తున్నారని పోలీసులు కొడితే.. మంత్రి కేటీఆర్ ఆ కుటుంబాలకు ఎందుకు అండగా నిలువలేదని అడిగారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన కె.కె.మహేందర్‌రెడ్డిని పక్కన పెట్టి కేసీఆర్ స్వార్థంతో తన కొడుక్కు సీటు ఇచ్చాడన్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ల్యాండు, సాండు, మైనింగ్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర రావడం లేదన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నిజాలు తప్ప అబద్ధాలే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల రాజయ్య, అంజన్‌కుమార్‌యాదవ్, బలరాం నాయక్, పొన్నం ప్రభాకర్, కెకె.మహేందర్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగుల సత్యనారాయణగౌడ్, చీటి ఉమేశ్‌రావు, అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ సందర్శన

సిరిసిల్ల పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌ను సందర్శించి, బాలికలతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మెనూ అమలుతీరు, వాష్‌రూమ్స్, వసతులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వడ్డించే భోజనాన్ని రేవంత్‌రెడ్డి పరిశీలించారు. బాలికలతో చాలా సేపు మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణులో జోష్ పెంచింది.



క్లుప్తంగా

గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బీమాసాహెబ్



కరీంనగర్: తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) మూడవ రాష్ట్ర మహాసభలు ఈనెల 1,2 తేదీల్లో నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో జరిగాయి. మహాసభల్లో జిల్లాకు చెందిన న్యాయవాది జి.బీమాసాహెబ్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లాకు చెందిన బోడా మోహన్‌నాయక్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా భీమాసాహెబ్ మాట్లాడుతూ, గిరిజన సమస్యల పరిష్కారానికి, భవిష్యత్ కార్యాచరణను మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, మైదాన ప్రాంతాల్లో ఐటీడీఏ ఏర్పాటు, గిరిజన బంధు, గిరిజన రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్‌లో చేర్చడం తదితర సమస్యలపై భవిష్యత్‌లో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తనను మళ్లీ ఎన్నుకున్న ప్రతినిధులు, గిరిజనులకు ధన్యవాదాలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినులతో క్యారమ్ ఆడుతున్న శ్రీదేవి

రామగిరి(మంథని): నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్జీ–3, ఏపీఏ ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు తన్నీరు శ్రీదేవి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగిరి మండలం సెంటినరీకాలనీలోని జేఎన్టీయూ యూనివర్సిటీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో 'స్థిరమైన లింగ సమానత్వం నేడు, రేపటి కోసం' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తుండడంతో తల్లిదండ్రులు సైతం ఆడ, మగ అనే భేదాన్ని పట్టించుకోవడం లేదన్నారు. పురుషులతో సమానంగా అవకాశాలు లభించినప్పుడే సమన్యాయం జరుగుతుందని, అప్పుడే లింగ వివక్ష తొలగిపోతుందన్నారు. కళాశాలలోని విద్యార్థినుల కోసం నిర్వహించిన షటిల్, క్యారం, చెస్ పోటీలను ప్రారంభించి కొంతసేపు పిల్లలతో ఆడి ఉల్లాసపరిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, డీవైపీఎం కావూరి మారుతి, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలతోనే నిజమైన చరిత్ర



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపీ సంజయ్, కలెక్టర్ కర్ణన్ తదితరులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

- తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిన ఘనత కరీంనగర్‌దే
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: ప్రపంచంలో పుస్తకానికి ఉండే విలువ దేనికీ ఉండదని.. అంతటి మహోన్నతమైన పుస్తకాలను కొనడం, చదవడమే కాకుండా అందులో జ్ఞానాన్ని నలుగురికి అందించాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జ్యోతిరావు పూలే పార్క్‌లో నిర్వహిస్తున్న కరీంనగర్ పుస్తక మహోత్సవం కార్యక్రమంలో ఎంపీ విశిష్ట అతిథిగా పాల్గొని స్టాళ్లను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ, కవులు, కళాకారులు, ఎందరో ప్రముఖులను అందించిన జిల్లా కరీంనగర్ అని అన్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిన ఘనత పుస్తకానికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఆన్ లైన్, వివిధ సామాజిక మాధ్యమాలతో కూడిన విద్యను అలవాటు చేయడంతో పిల్లల్లో ఆలోచన పటిమ సన్నగిల్లిపోతుందని, పిల్లలకు పుస్తకాలను దగ్గర చేసి చదువు చెప్పడం ద్వారా వారిని సొంతగా ఆలోచించగలిగే జ్ఞానవంతులుగా తీర్చిదిద్దగలుగుతామన్నారు. వేసుకునే బట్టలకు ప్రాధాన్యం ఇవ్వకుండా పుస్తకానికి విలువనివ్వడం ద్వారా ఆ పుస్తకం మనల్ని ఎంతో ప్రయోజకులుగా తీర్చిదిద్దుతుందన్నారు. మనకు తెలియని ఎన్నో విషయాల గురించి మనకు పరిచయం చేస్తూ నిజమైన చరిత్ర తెరమరుగు కాకుండా శాస్వతంగా అక్షరరూపంలో నిలిపి, భవిష్యత్ తరాలకు అందించగల శక్తి ఒక్క పుస్తకానికి మాత్రమే ఉందన్నారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ, జిల్లాలో రెండో దఫా నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రియాంక, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, డీడబ్ల్యూఓ సబితా కుమారి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, తెలంగాణ బుక్ ట్రస్ట్ సెక్రెటరీ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాగా పుస్తక ప్రదర్శన 4వ రోజు జిల్లాకు చెందిన సుదర్శనం వేణుగోపాలచారిని ముద్దసాని రాంరెడ్డి అవార్డుతో, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట్ల రామకృష్ణను భారత భాష భూషణ్ అవార్డులతో కలెక్టర్ సత్కరించారు.

సమ్మెకు యాజమాన్యాలే బాధ్యత వహించాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): ఓసీపీల్లో రేపటి నుంచి జరిగే సమ్మెకు యాజమాన్యాలే బాధ్యత వహించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, శాతవాహన మల్టీపుల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కౌశిక్‌హరి, సీఐటీయూ అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏర్పాటు చేసిన ఓబీ కాంట్రాక్టు కార్మికుల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఓబీ యాజమాన్యాలు కార్మిక సమస్యలపై కార్మిక సంఘాలతో చర్చించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈనెల 6 నుంచి సమ్మె ప్రకటించినా మొద్దు నిద్రపోతున్నట్లు యాజమాన్యాలు నటిస్తున్నాయన్నారు. విఫలం చేసేందుకు మాత్రం కుటిలయత్నాలను కొనసాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబీ యాజమాన్యాలు ఎన్ని బెదిరింపులకు దిగినా పట్టుదలతో సమ్మెను విజయవంతం చేయాలన్నారు. తమ హక్కులు, సౌకర్యాలపై జరిగే సమ్మెను ధైర్యంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కె.సూర్యం, ఐ.క్రిష్ణ, పూసాల తిరుపతి, మద్దెల శ్రీనివాస్, తిరుపతి, వేల్పుల కుమారస్వామి, రమేష్, వెంకన్న, ఓబీ కార్మికులు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



భిక్షాటన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ చౌక్‌లో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పూసాల విష్ణు మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతున్నా ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. సకాలంలో స్కాలర్‌షిప్‌లు అందక పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.5,300 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జీలు నితీష్, నందు, సాయి, శివ నగర సంయుక్త కార్యదర్శులు నాగరాజు, అబ్దుల్ రాజ్‌కుమార్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత, సంస్కారం లేని వ్యక్తి సత్యనారాయణ

- రేవంత్‌రెడ్డి, 'కవ్వంపల్లి'పై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అలియాస్ కామంపల్లి సత్యనారాయణకు సభ్యత, సంస్కారం లేదని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కవ్వంపల్లి అనుకున్నంత జనం రాకపోవడంతో మతితప్పి మాట్లాడారని ఆరోపించారు. సత్యనారాయణ ఏ గ్రామంలోనైనా కనీసం సర్పంచ్‌గా గెలిచినా తాను ఎమ్మెల్యేగా కొనసాగనని సవాల్ విసిరారు. 'ఆటపాటల గురించి నీకు ఏం తెలుసని, తెలంగాణ పాటలు పాడినప్పుడు నువ్వు ఎవరి పక్కలో పడుకున్నావో, ఎవరి మంచం కింద దూరినవో తెలియదా' అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. సమావేశంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం మరిచిన 'కవ్వంపల్లి'

తిమ్మాపూర్(మానకొండూర్): కాంగ్రెస్ నేతలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఎమ్మెల్యే రసమయి ఆరోపించారు. మానకొండూర్ నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన యాత్రలో రేవంత్‌రెడ్డి కాన్వాయ్ ఢీకొట్టడంతో తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన గీకురు నర్సయ్య గాయపడిన దృశ్యాన్ని కళ్లారా చూసినా.. కనికరం లేని కవ్వంపల్లి కాన్వాయ్‌ని ఆపకుండానే వెళ్లిపోవడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు నర్సయ్యను చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా, తాను పరామర్శించినట్లు పేర్కొన్నారు. నర్సయ్యకు మెరుగైన వైద్యం అందించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌గౌడ్, సంగుపట్ల మల్లేష్ రాజేందర్, సాగర్ తదితరులు ఉన్నారు.

ప్రతి కళాశాలలో నిర్బంధ వైద్య పరీక్షలు

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో అతి చిన్న వయస్సువారు గుండెపోటుతో మరణిస్తున్న తరుణంలో జిల్లాలో అటువంటి ఘటనలు జరగకుండా ప్రతీ కళాశాలలో నిర్బంధ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, ఐఎంఏ అసోసియేషన్, ఫార్మసి అసోసియేషన్, వైద్యాధికారులు, కార్డియాలజిస్టులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య పరీక్షల కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు ఈసిజి, రక్తపరీక్ష మొదలగు వైద్యపరీక్షలను నిర్వహించేలా ప్రణాళికను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ దిశగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, ఐఎంఏ, డయోగ్నోస్టిక్ నిర్వాహకులు వారి పూర్తి సహకారాన్ని అందించాలని అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ముందుకు వచ్చి మానవతా దృక్పథంతో సేవ చేయాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్,పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు, నగర మేయర్ వై.సునీల్‌రావు, అడిషన్ కలెక్టర్లు జీవీ శ్యాంప్రసాద్‌లాల్, గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈఓ ప్రియాంక, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు దేశానికి ఎంతో ఉపయోగం

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్‌అర్బన్: బాలికల చదువు దేశానికి ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ బాలికలకు ప్రతిభా పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లింగ వివక్ష లేకుండా తల్లిదండ్రులు బాలికల విద్యను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినుల్లో మొదటి ర్యాంకు సాధించిన వారికి రూ.5వేలు, రెండో ర్యాంకు సాధించినవారికి రూ.3వేల నగదు ప్రోత్సాహకాలను అందించారు. మారుముల ప్రాంతాల విద్యార్థినులకు విద్య ఎంతో అవసరమని, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని నిరుత్సాహపడి ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడకూడదని పేర్కొన్నారు. మరోసారి ప్రయత్నించి అనుకున్న విజయాన్ని సాధించాలన్నారు. కంపెనీ సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, ఏటా తెలుగు రాష్ట్రాల్లో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ జిల్లా నుంచి జిల్లా పరిషత్ స్కూల్లో చదువుతున్న వంద మంది బాలికలను ఎంచుకుని వారికి ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్ ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, విద్యా శాఖ అధికారి జనార్దన్‌రావు, కోరమండల్ సంస్థ జోనల్ మేనేజర్ సజన్‌కుమార్, డివిజనల్ ఆర్గానమిస్ట్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ యాజమాన్యం మొండివైఖరి వీడాలి

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ యాజమాన్యాలు మొండి వైఖరి వీడాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలంటూ శనివారం విద్యుత్ ఐక్య కార్యాచరణ సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని టీఎస్ఎన్‌పీడీసీఎల్, ట్రాన్స్‌కో కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో వేర్వేరుగా ధర్నా చేపట్టారు. విద్యుత్ సంస్థలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవచూపి విద్యుత్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. వేతన సవరణ, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ సమస్యలపై పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా యాజమాన్యాల నుంచి స్పందన లేదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకుంటున్న విద్యుత్ ఉద్యోగులపై వివక్ష వీడాలని కోరారు. లేకుంటే రిలే దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎస్.అంజయ్య, సీహెచ్.భాస్కర్, కె.శ్రీనివాస్, సీహెచ్.సంపత్‌కుమార్, వి.కిరణ్‌కుమార్, ఎస్.స్వామి, రఘు, వీరయ్య, యుగంధర్ పాల్గొన్నారు.

వెంటాడిన విధి

- నిజామాబాద్‌లో వివాహిత బలవన్మరణం
- రెండు నెలల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు
- ముస్తాబాద్‌లో విషాదం



అనూష మృతదేహం



ఆస్పత్రిలో చిన్నారి

ముస్తాబాద్(సిరిసిల్ల): విధి ఆ చిన్నారులపై పగబట్టిందేమో.. అభం శుభం తెలియని వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయారు. రక్తం పంచుకుపుట్టిన కొడుకు రెండు నెలల క్రితమే దూరం కాగా, ఇప్పుడు పెద్ద దిక్కు అవుతుందనుకున్న కోడలు లేకపోవడంతో పండుటాకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ముస్తాబాద్‌కు చెందిన జటాల అనూష నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కూతురు శ్రీకృతితో కలిసి శనివారం అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మూడేళ్ల శ్రీకృతికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటన ముస్తాబాద్‌లోని వారి బంధువులను విషాదంలో ముంచింది. ముస్తాబాద్‌కు చెందిన జటాల ప్రేమానందం, కల్పన దంపతులు వ్యాపార రీత్యా కరీంనగర్‌లో స్థిరపడ్డారు. వీరి పెద్ద కుమారుడు శ్రీనివాస్ రెండు నెలల క్రితమే మృతిచెందాడు. ఆ బాధ నుంచి తెరుకోకముందే నిజామాబాద్‌లో పెద్దనాన్న ఇంటికి వెళ్లిన ప్రేమానందం కోడలు అనూష శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. అనూష పెద్దకూతురు శ్రీవల్లికి జ్వరం రావడంతో కరీంనగర్‌లోనే తాత ప్రేమానందం వద్ద ఉంచి వెళ్లింది. భర్త మరణాన్ని తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది అనూష ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొంటున్నారు. ప్రేమానందం కూడా తీవ్ర అనారోగ్యంతో మంచంపట్టాడు. ఆయన చిన్న కుమారుడు కెనడాలో ఉంటున్నాడు.

పోలీసుల తనిఖీలు

జగిత్యాలజోన్ : అర్ధరాత్రి రోడ్లపై తిరిగే యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని పోలీసులు ఆపరేషన్ చబుత్రలో భాగంగా 48 మందిని అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి రోడ్లపై అనుమాస్పదంగా కనిపించిన యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు.



అలరించిన కలర్స్ డే

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల్లో శనివారం నిర్వహించిన కలర్స్ డే కార్యక్రమం ఆకట్టుకుంది. పాఠశాల ఆవరణను వివిధ రంగులతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతకు ముందు కార్యక్రమాన్ని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రతీ రంగు మానవుని జీవిత గమనాన్ని సూచించేలా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రంగులకు ఉన్న ప్రాముఖ్యతను వివరించా రు. కార్యక్రమంలో డైరెక్టర్ కడారి సునీతరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడువుమీరిన మందుల విక్రయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని మ్యాదరవేని శ్రీనివాస్ వరిపంటకు తెగుళ్ల ఆశించడంతో నివారణకు వినియోగించిన క్రిమిసంహారకమందుతో పొలమంతా మాడిపోయింది. గత నెల 28న మార్కెట్‌రోడ్డులోని ఓ ఆగ్రో ఏజెన్సీలో క్లించర్ క్రిమిసంహారకమందును కొనుగోలు చేసిన రైతు శ్రీనివాస్ శనివారం పిచికారీ చేయగా 30గుంటల పొలమంతా మాడిపోయింది. వెంటనే దుకాణ యజమానికి సమాచారం ఇవ్వగా సదరు కంపెనీ ప్రతినిధి వచ్చి పొలాన్ని పరిశీలించారు. కొనుగోలు చేసిన క్రిమిసంహారక మందుడబ్బా, బిల్లు రశీదు ఇస్తే మరో మందును ఇస్తామని చెప్పగా రైతు నిరాకరించాడు. అనంతరం గడువు మీరిన క్రిమిసంహారక మందు వాడకంతోనే పంటంతా మాడిపోయిందని కలెక్టర్ ఆర్వీ కర్ణన్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గడువు తీరిన మందులను విక్రయిస్తున్న సదరు దుకాణంపై తగిన చర్యలు చేపట్టాలని, కంపెనీ నుంచి పంటకు నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేయాలని వారు కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

- యువ ఉత్సవ్ కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

తిమ్మాపూర్(మానకొండూర్): దేశ సంస్కృతి, సంప్రదాయాలను యువత కాపాడాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర యువజన క్రీడ మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఎంపీకి కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులకు పెయింటింగ్, ఫొటోగ్రఫీ, రైటింగ్, కల్చరల్ ప్రోగ్రాం లాంటి 5 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా 13 చోట్ల యువ ఉత్సవ్ కార్యక్రమాలు నిర్వహించగా, అందులో కరీంనగర్ జ్యోతిష్మతి కళాశాలలో జరగడం సంతోషంగా ఉందన్నారు. అన్ని రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు ప్రధాని మోదీ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మోదీని రావడన్ని వ్యతిరేకించిన అనేక దేశాలు నేడు ఘన స్వాగతం పలుకుతున్నాయని వివరించారు. కోవిడ్ వ్యాక్సిన్ తయారు చేయడం మన దేశ అభివృద్ధికి సూచకం అన్నారు. దేశ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలకు సంప్రదాయాలు నేర్పడంలో జ్యోతిష్మతి చైర్మన్ సాగర్‌రావు ముందున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంచాలకులు ఏఆర్ విజయరావు, ఆంజనేయులు, అరుణ్‌కుమార్, శ్రీధర్, వెంకట రాంబాబు, రాజావీరు, రవీందర్, కిరణ్, భానుచందర్, కళాశాల ప్రోగ్రాం అధికారి విశ్వ ప్రకాష్ బాబు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలము ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కరీంనగర్
ఈ క్రింది వాహనములకు తేది: 06-03-2023 సోమవారం రోజున వేలము నిర్వహించబడును.

S.No.	VEHICLE No.	DESCRIPTION	MODEL
1.	TS15UB 3654	TATA LPT 3118 CUMMINS FBT	2016
2.	TS02EQ 3974	JOHN DEERE 5055 E	2014
3.	TS02UD 0785	TATA INTRA V30 BS6	2021

వేలము వేయు స్థలము :
SHRIRAM AUTOMALL
SY.NO. 437, 438, BESIDE KOTAK MAHINDRA BANK, HYDERABAD ROAD, ALUGUNUR VILLAGE, THIMMAPUR MANDAL, KARIMNAGAR DIST.
Cont: 0878-2994549, Cell: 9866247854

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

ఋణాలు ఇవ్వబడును

ఎలాంటి ఆస్థి పత్రాలు లేకున్నా స్వంత ఇల్లు కలిగి ఆధార్, పాన్ కార్డు వున్న ప్రతి వారికి అతి తక్కువ వడ్డీతో ఋణాలు ఇప్పించబడును. సెల్: 9014653011 [K-1219964]

INVESTMENT

I, MOHAMMED TAUSIFUDDIN FAIYAZAN, Date of Birth: 14-07-1998 (recorded in my Passport No. B2817437), R/o H.No. 5-6-2/6, Krishna Nagar Colony, NTPC, Ramagundam (Mdl), Peddapalli Dist., hereby declare that my actual & correct name & D.O.B. as per my Aadhar Card & Edu. Certificates are MD TAUSIFUUDDIN FAIZZAN S/o MD BADRUDDIN SALEEM, 14-07-1999 [K-1219906]

CONSULTANT

Concord IT Systems INC. Filing H1B for the fiscal year 2023-24, 100% approval rate. Immediate GC processing for deserving consultants. Send your resume at Info@concorditsystems.com +13139693206 / +91 83286 37311 / +91 70954 90108 [H-793342]

INVESTMENT

భూమి పైన పెట్టుబడి పెట్టే వారికి సువర్ణ అవకాశం, యాదగిరి గుట్టకి దగ్గరలో 242Sq. కొనండి. ప్రతినెలా అద్దె పొందండి. ఫోన్ : 9182282332. [H-787450]

BUSINESS OFFER

పర్మినెంట్ బిజినెస్ వన్‌టైమ్ పెట్టుబడిలోనే లైఫ్ టైమ్ మాస్టర్ ఫ్రాంచైజీ లీడింగ్ మల్టీ బిజినెస్ డైలీ సపోర్టు+ట్రైనింగ్+మంచి భవిష్యత్తు + ఆదాయం +15 సం॥ల అనుభవం. ఫోన్ : 9908743603 [HA-5600]

WANTED

పనివారు కావలెను. హైదరాబాద్, భువనగిరిలో గల చిన్న కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంటపని, ఇంటిపని, డ్రైవింగ్, గార్డెనింగ్ మొ॥ పనులు చేయుటకు భార్యాభర్తలు కావలెను. డి.బాలాజీ, భువనగిరి. ఫోన్ : 92469 69042, 98481 75211 [V- 1767]

స్వాతి పెయిన్ రిలీఫ్ ఆయిల్ సేల్ చేస్తూ నెలకి 10,000/- సంపాదించుకునే అవకాశం పెట్టుబడి రూ.10,000/- ఆదివారం కరీంనగర్‌లో కలవచ్చు. ఫోన్ : 84650 56299 [V- 5639]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]

నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఇంట్లో 24 గం॥లు వృద్ధున్ని చూసుకోవడానికి ఇంటిపనికి పురుషులు కావలెను. జీతం: 15 వేలు, ఫ్రీ వసతి +భోజనం. సంప్ర॥ సెల్: 9848652107 [Y-784319]

లేపాక్షి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పెషేంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 20K. ఏజెంట్ కమీషన్ 5K. Ph: 9640300074 [HA-1047]

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-792834]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190584]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824